# హలో

— అద్దేపల్లి సుమిత్రా దేవి

"మీరు సాయంత్రం ఫ్రీయేనా?"

ఒకపక్క సంశయం మరోపక్క కోరిక అటూ యిటూ లాగుతుంటే చిన్నగా శశాంక అడిగిన తీరు అరవిందకి తమాషాగా అన్పించింది.

అతనెప్పుడో అలా అడుగుతాడని అరవింద అనుకుంటూనే వుంది. ఆఫీస్ లెటర్స్ డిక్టేట్ చేస్తూ చేస్తూ మధ్యలో ఆగిపోయి తన వంకే చూస్తుండి పోవడం, మాటల్లో తరుచూ తడబడడం తనతో ఏదో చెపాలనీ చెప్పలేకపోవడం అతన్ని చాలా రోజుల్నుంచి గమనిస్తూనే వుంది.

శశాంక ఏం చెప్పాలనుకుంటున్నాడో, తన నుంచి ఏం ఆశిస్తున్నాడో తెలుసుకోలేని అమాయకురాలేం కాదు అరవింద.

అరవింద ఆ ఆఫీసులో చేరి మూడు నెలలుఅవుతూంది. కానీ కొందరి మగ వాళ్ళ చూపులు, ఆ చూపుల వెనకుండే ఆకలిని ఎదుర్కోవడం ఆమెకు కొత్తేమీ కాదు. ఆ ఆకలి వేధింపుల వల్లనే ఆమె అప్పటికి రెండు ఆఫీసులు మారింది.

తండ్రిలేని కుటుంబం ఆమెది. ఎంత జీతమైనా సరే. ఓ పద్ధతి, పాదుపూ లేకుండా ఖర్చు చేసేసి ఎప్పుడూ చిల్లర అప్పులు చేస్తూ అవి తీర్చమనే తల్లీ, సినిమా పిచ్చిలో పడి పగటికలలు కంటూ చదువును నిర్లక్ష్యం చేస్తున్న తమ్ముడూ, హైస్కూల్లో చదువుతున్న చెల్లెలూ అరవింద జీవితం చుట్టూ వున్న వలయాలు. ఆ వలయాలు దాటి రాలేదు అరవింద. అవి ఇంట్లో సమస్యలయితే మగతోడు లేని కుటుంబంలో పరిపూర్ణ యవ్వనంతో, మిసమిసలాడుతూ అందంగా వుండే అమ్మాయి అంటే అందరికీ ఓ బాణం వేసి చూస్తేనో అనిపిస్తుంది కాబోలు. ఇంట్లో బాధించే ఆర్థిక సమస్యల కన్నా ఈ బయటి వేధింపులే ఎక్కువ కలతపెట్టేవి అరవిందని.

తానేమీ వెర్రి మొర్రి అలంకరణలేమీ చేసుకోదు.

ఓరచూపులు, కులుకు నడకలతో హొయలు పోవడం, మాటకి ముందు విరగబడి నవ్వడం ఇలాంటి కవ్వించే చేష్టలేమీ చేయదు. కుదురుగా జడ ల్లుకుని ముఖానంత బొట్టు పెట్టుకుని పొందిగ్గా చీర కట్టుకుని వీధిలోకొస్తుంది. తన మానాన తాను పోతున్నా ఈ మగ ప్రపంచం వూరుకోదేం? బస్సుల్లో చేతులూ భుజాలు తగిలించడం, వెనుక నుంచి వచ్చి రష్‌లో హత్తుకుపోవడం, దారిన పోతూ పోతూ ఓ వెకిలి మాట అనేసి పోవడం ఇలాంటివన్నీ తనతో పాటు ప్రతి స్త్రీకీ తప్పనివేం. తానొక్కర్తే ఏం చేయగలదు? అనేసి దులపరించుకుపోతున్నా ప్రత్యేకంగా ఆమె పనిచేసే ఆఫీసులో మగవాళ్ళ నుంచి తప్పుకోవడం మాత్రం ఆమెకు దుస్సాధ్యంగానే వుంది.

"కళ్ళు తిప్పుకోలేని అందం. పెళ్ళికెటూ యిప్పుడల్లా దిక్కు లేదు. ఆర్థికంగా స్థిరమైన పొజిషన్ లేదు. దారికి రాక ఎక్కడకు పోతుంది?" అన్న ధీమాతోనే ప్రవర్తిస్తారు ఆమెతో అందరూ. అప్పటికి రెండు ఆఫీసుల్లో ఉద్యోగం మానేసింది ఆ సమస్యలతోనే. ఇప్పుడు కొత్తగా చేరిన దీంట్లోనూ మేనేజరు అప్లికేషన్ వేయనే వేసాడు. తను 'నో' అనగానే ఇంతెత్తున మండిపడ్డాడు.

"నిన్నెలా ఒడిలోకి రప్పించుకోవాలో బాగా తెలుసు నాకు. నీలాంటి వాళ్ళను యిగో ఇంతమందిని చూశాను" అని బట్టతల చుట్టూ వున్న నాలుగు వెంట్రుకల్ని చూపిస్తూ ఛాలెంజి చేశాడు.

పైకి అప్పటికి నిసురుగా ఆయనతో ప్రవర్తించినా లోలోపల బెదురుగానే వుంది. 'ఈ జాబ్‌కీ మంగళం పాడే రోజొచ్చేసినట్టుంది' అని. ప్రైవేటు కంపెనీల్లోనే అయినా..
ఎక్కడ దొరుకుతాయి తనకి ఇలా ఉద్యోగాలు మానేస్తూపోతే. తిండిలేక తన కుటుంబం వీధిన పడిన నాడు కూడా తానిలా బింకంగా వుండగలదా?

దాదాపు తన లాంటి పొజిషన్‌లోనే వున్నా ఎప్పుడూహాయిగా నవ్వుతూ తుళ్ళుతూ కనిపించే తన స్నేహితురాలు స్వప్నకితన బాధలు చెప్పుకుని వాపోయింది ఓనాడు అరవింద.

"చూడు విందూ డియర్. కొంత మంది అదృష్టవంతుల్లా జీవితం మనకు వడ్డించిన విస్తరి కాదు. అయినా లోకంలో రకరకాల సమస్యలతో అవస్థలు పడుతూ జీవించే ఎంతో మంది కన్నా మనం ఓ రకంగా అదృష్టవంతులమే. మననుసోరూ కాస్త నొక్కేస్తే మనకన్నా సుఖపడే వాళ్లుండరు ఈ లోకంలో. మనకోసం మన పెద్దలెవరూ మంచి సంబంధాలు వెతికి తెచ్చి మనకు పెళ్లిళ్ళు చేయకలిగే స్థితిలో లేరు కదా! పైపెచ్చు మనం తెచ్చే జీతంరాళ్ళతోనే బతికే జీవాలెన్నో మన చుట్టూ. అలాంటిది మనల్ని మనం మోసం చేసుకుంటూ ఇన్నాళ్ళు ఈ పవిత్రత అనే పరదా వెనుక దాక్కున్నా ఈ పరదానే మన మెడ చుట్టూ బిగించి పీక నొక్కెయ్యాలనే చూస్తారు తప్ప మనల్ని ఎవరూ అర్థం చేసుకోరు. అందుకే నా మాట విని నువ్వూ నాలా బతికెయ్యటం అలవాటు చేసుకో.

'నన్నంటుకోకు నా మాల కాకి' అన్నట్లు ముడుచుకుపోకు. చక్కా ఓ బాయ్ ఫ్రెండ్‌ను చూసుకో. అతనే విసిగించే యీ చీపురు ముళ్ళలాంటి సమస్యల్నించి మనను రక్షిస్తాడు. సినిమాలూ షికార్లూ బహుమతుల్తో లైఫ్‌లో కాస్తంత సరదా, మార్పు కనిపిస్తుంది. "హాయ్" అన్న వాడు యీడూ జోడుగా వున్నాడనిపిస్తే నువ్వూ హాయ్ అనేసేయ్. అంతకన్నా మనకు మరో రాజమార్గమేమీ లేదు. మనమిలా ఎన్నాళ్ళూ కన్యత్వాన్ని కాపాడుకున్నా మన చేయందుకునే రాకుమారుళ్ళెవరూ రారు గాక రారు." స్వప్న సుదీర్ఘంగా బోధపరిచిన విషయ సారాంశమంతా అరవింద బుర్రలోకి ఎక్కేందుకు చాలా సేపు పట్టింది. అర్థమైన తర్వాత తెల్లబోయింది.

"మైగాడ్, హాయ్ అని బోలెడు మంది అంటారు. అన్న ప్రతి వాడితోనూ....?"

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్



"మరీ అలా కళ్ళు తేలెయ్యకు. నీతో భుజాలు రాసుకుని నడవాలనుకునే ప్రతి వాళ్ళూ పడక దాకా నడుస్తారనుకోకు. ఏదో పరాయి ఆడదాని వేలి కొసలు తాకినా అదో తృప్తి అనుకుంటారే తప్ప వాళ్ళేమీ ముందుకు రారు. ఎందుకంటే అలా అఫైర్లు నడిపేందుకూ ఎంతో ధైర్యముండాలి. అందరూ కథలు నడపగలిగే మగవాళ్ళే అయితే యిలా బస్సుల్లోనూ, రోడ్లపైనా స్పర్శా సుఖాలతోనూ, నోటి మాటలతోనూ తృప్తి పడిపోయే వాళ్ళు మనకు తారసపడనే పడరు. మరో ముఖ్య విషయం ఏదో సరదాగా వుండమన్నారు కదా అని మనసూ, ప్రేమా అని యిన్‌వాల్వ్ కాకు. అలాంటి వాళ్ళు మళ్ళీ అడ్రసు లేకుండా తప్పించుకుంటారు. అనుభవాల కోసం వెంపర్లాడే మగవాడు అనుభూతి అంటూ గిరి గీసుకోడు!"

స్వప్న మాటలు మనసుకు కటువుగా, జీర్ణం చేసుకోలేనట్లున్నా వాస్తవం కాదనుకోలేకపోయింది అరవింద. ఆలోచించే కొద్దీ స్వప్న జీవన సరళిలో తప్పేమీ కనిపించలేదు.

ఆ తర్వాత క్రమక్రమంగా ఎవరేమన్నా స్పందించడం మానేసింది అరవింద.

అలాంటి సమయంలో కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చిన యీ యువ ఆఫీసరు శశాంక రాక ఆమెలో అలజడికి కారణమైంది. మగవాడి చూపుల్లో కామం తప్ప మరేమీ లేదనుకునే అరవిందకి అతని చూపుల్లో సరికొత్త అర్థాలు కనిపిస్తున్నాయి. అనురాగ సంకేతాల్లా అనిపిస్తున్నాయి. కానీ అది అనురాగం అనుకోవడం తన భ్రమేనేమో అని కూడా అనిపించసాగింది. లేకపోతే కన్నెపిల్లల కలల రాకుమారుడిలా వుండే అతనికి తనపై ప్రేమేమిటి? అతనే కోరుకుంటే తనకన్నా అందగత్తెలు అంతస్థు కలవారు అతనికి భార్యలవుతారు.

"శశాంకకి తన పట్ల కోరికే కాని ప్రేమ కాదు." అలా అని మనసుకి గట్టిగా నచ్చ చెప్పుకునేందుకు అరవింద చాలా ప్రయత్నించవలసి వచ్చింది.

కానీ మనసు మరో రకంగా ఎదురు తిరగసాగింది. "అతనికి తనపై ప్రేమ లేకపోవచ్చు. కానీ తన కుంది కదా. ఇష్టపడిన మగవాడికి తన అందం అర్పించుకోవటంలో తప్పేమిటి? అతనితో జీవితాన్ని పంచుకోలేకపోయినా కనీసం ఓ అనుభవాన్ని పంచుకుంటే జీవితాంతం తను హృదయంలో ఆ అనుభూతిని పదిలంగా దాచుకోదూ? ఆ తృప్తి చాలదూ?

స్వప్న సలహా గుర్తొచ్చింది. శశాంక తనను పెళ్ళాడాలని కోరుకోవడం అత్యాశే కాదు అసంభవం కూడా. ఎందుకంటే తను తన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా అనాథల్లా వదిలేసి తన సుఖం చూసుకోలేదు. అందుకే అతనే కనుక తనను కోరుకున్న నాడు తను ఆనందంగా అతనికి సొంతమయి పోవాలని అనుకుంది.

అలాంటి నిర్ణయానికొచ్చిన తర్వాత శశాంక పిలుపుకై అరవింద కూడా లోలోన ఎదురు చూడసాగింది అన్నా అతిశయోక్తి కాదు. అలాంటి ఆహ్వానాన్నే యీనాడు అందుకుంది. అందుకే అరవింద మనసు ఆనందంగా నవ్వుకుంది. ఆ నవ్వు కళ్ళలో ప్రతిఫలిస్తుండగా తల వూపుతున్న ఆమెను చూసి యీసారి కాస్త నిస్సంకోచంగా అడిగాడు తను.

"ఇవాళ నా పుట్టిన రోజు. సాయంత్రం మీరు యింటికి రాగలరా?"

"అలాగే. కానీ నాకు మీ యిల్లు తెలియదే?"

అతను కుర్చీలో రిలీఫ్‌గా వెనక్కివాలుతూ అన్నాడు.

"సాయంత్రం ఆరింటికి టాంక్ బండ్ కొచ్చేయండి. నేనొచ్చి మిమ్మల్ని తీసుకెళ్తాను."

అరవింద ఒప్పుకుంది.

....


సాయంత్రం సమయం ఏడు కావస్తొండగా శశాంక ఇంటి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చొని వున్నారు వాళ్ళిద్దరూ.

"పార్టీ అన్నారు. ఎవర్నీ పిలవలేదే?"

శశాంక అందించిన ఫ్రూట్‌జ్యూస్ మెల్లగా సిప్ చేస్తూ అడిగింది అరవింద.

"పుట్టిన రోజును ఆడంబరంగా చేసుకోవడం నాకిష్టం లేదు. నా మనసుకి నచ్చిన వారితో ఈ పూట ఆనందంగా గడపాలనుకున్నానంతే. అందుకే మిమ్మల్ని మాత్రమే పిలిచాను." అర్థవంతంగా చూశాడామె వైపు.

"మనసుకి నచ్చిన" ఎగసిపడబోతున్న హృదయాన్ని బలవంతంగా జోకొట్టింది అరవింద.



"కోరిక తెలిపేముందు ఇలాటి మాటలే బోలెదు అంటారు మగ వాళ్ళు. అవన్నీ నిజమనుకుని కలలు కనకు!" ఎక్కడ్నుంచో స్వప్న చెబుతున్నట్టు అనిపించింది.

"నా యిల్లు చూద్దురుగానీ రండి" అతను సోఫాలోంచి లేస్తూ అన్నాడు.

అరవింద అనుసరించింది. ఇల్లు పెద్దది విశాలంగా వుంది. చివరగా బెడ్‌రూమ్‌లోకి నడిచాడు. గదిలో నీలి రంగు జీరోవాల్ట్ బల్బు వెలుగుతోంది.

"సారీ, ఈ రూమ్‌లో ట్యూబ్‌లైట్ పాడయింది" చిన్నగా అన్నాడతను, అది అబద్ధమని స్పష్టంగా తెలుస్తున్నా.

అస్పష్టంగా వున్న నీలి వెలుగులో కిటికీ కవతలున్న సన్నజాజి తీగ మంచి గది లోపలికి కుతూహలంగా అన్నట్టు తొంగిచూస్తున్న పువ్వుల్ని చూస్తూ అప్రయత్నంగా అటు నడిచింది అరవింద.

ఓ నిమిషం తర్వాత వెనుకనే వచ్చిన శశాంక ఆమెను దాదాపు తాకుతున్నట్టే నిలబడుతూ అన్నాడు.

"నాకు సన్నజాజులంటే చాలా ఇష్టం."

మెడ మీదుగా చెవి పక్కన వెచ్చగా వస్తున్న అతని ఊపిరి ఆమెకు గమ్మత్తుగా అనిపించి కొద్దిగా ఉలికిపడుతూ తలతిప్పింది.

"సన్నజాజి కన్నా బావుండే నీరంటే మరీ మరీ యిష్టం!"

శశాంక చేతులు ఆమె భుజాలపై పడ్డాయి సున్నితంగా.

అరవింద విదిలించుకుని దూరంగా జరుగుతుందేమోనని చూశాడు కానీ ఆమె నవ్వింది తీయగా సన్నజాజిలా. ఆ తర్వాత అతనికి అంగీకార సూచకంగా అభిముఖంగా తిరిగి. శశాంక మోచేతి వంపులో చెక్కిలి ఆనించింది పరవశంగా.

అతనామెను హత్తుకుపోతూ పెదవులందుకున్నాడు. అరవింద ఏమీ అభ్యంతరం చెప్పలేదు. ఇక అతను తనని బెడ్‌వైపు నడిపించడం మాత్రమే తరువాయని మనసులో రేగే అలజడి సర్దుకుంటూ దానికి సిద్ధపడుతూ కళ్ళు మూసుకుని అతని చేతుల్లో ఒరిగివున్నామె హఠాత్తుగా అతను తనను దూరంగా నెట్టి వడివడిగా వెళ్ళిపోవడంతో తెల్లబోయింది. వింతగా అనిపించింది. చెళ్ళున కొట్టినట్టయింది కూడా.

ఆ మైకంలో అంతకు పూర్వం జారిపోయిన పైటను సరిచేసుకుంటూ ఆ గదిలోంచి బయటకు వచ్చింది.

డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో ఒడిపోయినట్టు, అలసటగా కూర్చుని వున్నాడతను. వెళ్ళి అతనికెదురుగా కూర్చుంది. ఇంకేం చేయాలో తెలియనట్టు అసలిదంతా ఏమిటో అతని ఈ విచిత్ర ప్రవర్తనకు అర్థం ఏమిటో తెలియక తికమకగా వుంది అరవిందకు.

శశాంక కళ్ళు మూసుకుని ఆమె వునికిని గమనించి మెల్లగా గొంతు విప్పాడు. "నేను నిన్ను చూసిన మొదటి రోజునే అనుకున్నాను. నా జీవిత భాగస్వామిని కాబోయే అమ్మాయి యిన్నాళ్ళకు దొరికిందని. ఇన్ని రోజులుగా చూస్తూ నీపై నా ప్రేమను పెంచుకుంటూ అది నీకెలా చెప్పాలో తెలియక తటపటాయిస్తూ గడిపాను. కానీ నా మనసు నీకు తెలిపే ముందు అసలు నువ్వేమిటో నేను పూర్తిగా, స్వయంగా తెలుసుకోవాలన్న తమాషా ఆలోచన వచ్చింది నాలో. అందుకే బర్త్‌డే అని చెప్పి ఇలా ఒంటరిగా తీసుకువచ్చాను. ముందు నువ్వసలు రానంటావనుకున్నాను కానీ వచ్చావు. ఇలా నిన్ను మాత్రమే పిలవడం, నువ్వు బెదిరిపోతావనుకున్నాను. కానీ నువ్వు యివన్నీ చాలా సహజమన్నట్టు నీకిలాంటి ఆహ్వానాలు మామూలు అన్నట్టు ప్రవర్తించావు. ఇక నువ్వు బెడ్‌రూమ్‌లో సెక్స్‌కు కూడా సిద్ధమేనంటూ అతి సులభంగా నా చేతుల్లో కొచ్చేశావు. ఇలా ఇంతకు ముందు ఇంకెందరి కౌగిలిలో కెళ్ళిపోయావో నాకు తెలియదు కదా.

"నో, అయ్ నెవర్ యిమేజినిట్. ఇలాంటి అమ్మాయిని కాదు నేను పెళ్ళి చేసుకోవాలనుకున్నది. నా భార్య నాకు మాత్రమే సొంతం కావాలనుకోవడం అత్యాశ కాదుకదా. ఆశేకాదు ఆ విషయంలో నాకు పరిపూర్ణ నమ్మకం కూడా వుండాలి."

ఆగాడతను ఆవేశం తగ్గించుకోవడానికన్నట్టు.

అతని మాటలు మనసుకు అర్థమవడానికి కొద్ది సేపు పట్టింది అరవిందకు.

అంతే!? "ప్లీజ్. నువ్వింటికెళ్ళిపో..." అంటూ కళ్ళు తెరిచిన అతనికి ఎదురుగా స్పృహ తప్పివున్న అరవింద కనిపించింది. ■

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

# చిక్కుముడి-22 — పాపినేని శివశంకర్

## చిక్కుముడి 21 సమాధానాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 కొ | య్య | 2 గు | ర్రం | ■ | 3 బా | ధ |
| ల్లా | ■ | డి | ■ | 4 సా | కె | ■ |
| యి | ■ | 5 బం | టు | ■ | 6 డు | ల్లు |
| ■ | ■ | డ | ■ | 7 స్వ | ■ | ■ |
| 8 పో | 9 గు | ■ | 10 | యం | ■ | 11 కు |
| ■ | 12 బు | వ్వ | ■ | వ | ■ | లు |
| 13 డా | లు | ■ | 14 పో | రం | బో | కు |

ఆధారాలు

అడ్డం

1. పదార్థాలను తెలియజేసే గ్రంథం (4)
3. ఉదయం (2)
4. తంటా (2)
5. పదును పెట్టేరాయి (2)
6. చివర (2)
8. కోవెలలో ఖరీదు చెయ్యండి (2)
9. సంవత్సరం (2)
12. చీలిక (2)
13. పాట (2)
14. శివసాగర్ కవితా సంపుటి (4)

1. 'ఏవి తల్లీ! - కురిసిన హిమసమూహములు' (3)
2. ఏ పాటు తప్పినా - తప్పదు, తలకిందులైనా! (3)
3. రాత్రి పూట కనబడక పోవటం (4)
7. 'నయాగరా'ని ఏమంటాం? (4)
10. రోలు వెళ్ళి దీంతోనే మొరపెట్టుకుంటుంది! (3)
11. ముద్దు పలుకులు పలికే పిట్ట (3)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | |
| | ■ | | ■ | 4 | | ■ |
| | ■ | 5 | | ■ | 6 | |
| ■ | 7 | ■ | ■ | ■ | | ■ |
| 8 | | ■ | 9 | 10 | ■ | 11 |
| ■ | 12 | | ■ | | ■ | |
| 13 | | ■ | 14 | | | |